RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :39 బుధవారం 06 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## 72 శాతం మంది ఎన్డీఏ పాలనలోనే...

ఇండియన్ పాలిటిక్స్ లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో ఘన విజయాలు సాధించడంతో దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సంఖ్య 21కి చేరింది. ఇది బీజేపీకి ఒక చారిత్రక మైలురాయి. 2018లో సాధించిన రికార్డును మళ్లీ అందుకోవడమే కాకుండా, 1970ల చివరలో ఇందిరా గాంధీ హయాంలో కాంగ్రెస్ నెలకొల్పిన రికార్డును కూడా సమం చేసింది. 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పుడు బీజేపీ కేవలం 7 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. పక్కా వ్యూహాలు, సంస్థాగత పటిష్ఠత, బలమైన పొత్తులతో 2018 మార్చి నాటికి ఈ సంఖ్యను 21కి పెంచుకుంది. అయితే, ఆ ఆధిపత్యం ఎక్కువ కాలం నిలవలేదు. 2018 డిసెంబర్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్గఢ్లలో ఓటమితో ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సంఖ్య వేగంగా తగ్గింది. ఒకానొక దశలో 13 రాష్ట్రాలకు పడిపోయింది. 2024 లోక్సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ కోల్పోవడం కమలదళానికి పెద్ద ఎదురుదెబ్బగా భావించారు. హోంమంత్రి అమిత్ షా, పార్టీ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా తెరవెనుక వ్యూహరచనతో పార్టీ యంత్రాంగాన్ని తిరిగి గాడిలో పెట్టారు.

రిపోర్టర్లు కావలెను

ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను

సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.

ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

# తెలంగాణ రాజకీయాల్లో వేడి

## ఒకే రోజున బీఆర్ఎస్, కాంగ్రెస్ భారీ రైతు సభలు

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి పెరిగింది ప్రతిపక్ష బీఆర్ఎస్ నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సు మరియు అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన "కిసాన్ మేళా" కార్యక్రమాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ భారీ స్థాయిలో రైతు సంగ్రామ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. అయితే, ఈ కార్యక్రమానికి సంబంధించిన పార్టీ జెండాలు, తోరణాలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తొలగించడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది రాజకీయ ప్రేరిత - మిగతా5లో



# జూన్ 2 లోపు కేబినెట్ విస్తరణ

**హైదరాబాద్, మే 5:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. పరిపాలనలో వేగం పెంచడం, రాబోయే సవాళ్లను ఎదుర్కోవడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు సిద్ధమవుతున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం కనిపిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం మంత్రివర్గంలో ముగ్గురు కొత్త వాళ్లకు చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇందులో ఖాళీగా ఉన్న



ఒక స్థానంతో పాటు, పనితీరు సరిగా లేని ఇద్దరు మంత్రులను తప్పించి వారి స్థానాలను భర్తీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. ముఖ్యంగా ప్రజలతో నేరుగా సంబంధం ఉండే కీలక శాఖల మంత్రుల పనితీరుపై ఇప్పటికే హైకమాండ్ నివేదికలు తెప్పించుకుంది. కొన్ని ప్రతిష్ఠాత్మక హామీల అమలులో వెనుకబడిన శాఖల బాధ్యతలను సమర్థులకు అప్పగించేలా భారీ మార్పులు జరగనున్నాయి. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంశం మరోసారి చర్చకు వచ్చింది. తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హైకమాండ్ హామీ ఇచ్చిందని ఆయన పదేపదే చెప్తున్నారు. అయితే, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ఇప్పటికే తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా - మిగతా5లో

## హైదరాబాద్‌కు అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ రాక

**హైదరాబాద్, మే 5:** హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. **BASF**తో తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు **BASF** ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ **(LoI)** అందజేశారు. ఈ సందర్భంగా దీురాఖీ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. ఈ హబ్ ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్ సేవలకు వ్యూహాత్మక కేంద్రంగా పని చేయనుంది. గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్‌వర్క్‌కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది. తెలంగాణలో మరో మెగా గ్లోబల్ కంపెనీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపై ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌పై అంతర్జాతీయ కంపెనీల నమ్మకం మరింత పెరుగుతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.




## విద్యుత్ ఒప్పందాలపై సీబీఐ విచారణ..

- బీఆర్ఎస్ సర్కార్‌ను టార్గెట్ చేసిన రేవంత్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని విద్యుత్ ఒప్పందాలపై సీబీఐ విచారణకు నిర్ణయం
- ఛత్తీస్‌గఢ్ పీపీఏ, భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్లపై ప్రధానంగా దర్యాప్తు
- జస్టిస్ మదన్ బి లోకూర్ కమిషన్ నివేదిక ఆధారంగా కేబినెట్ ఆమోదం
- అంతర్రాష్ట్ర అంశాలు ఉన్నందున సీబీఐ విచారణకు మొగ్గు చూపిన ప్రభుత్వం

తెలంగాణ గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరో గట్టి షాక్ తగిలింది. ఆ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ), - మిగతా5లో



# సంపాదకీయం

## ఉపశమనమా లేక దీర్ఘకాల అభివృద్ధా?

దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయం గా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి.ఇవి ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది.యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి.ఇక్కడ విద్య, ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం. ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, హామీలు ఇవ్వడం చాలా సులభం. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది, ప్రజల నుంచే. ఒక సమాజం చైతన్యవంతంగా మారితే, రాజకీయాలు కూడా మారతాయి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా, తమ బాధ్యతలను కూడా గుర్తించాలి. ఉచితాల కోసం కాకుండా, అభివృద్ధి కోసం ఓటు వేయాలి. అప్పుడు మాత్రమే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, మేధావులు కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఉచితాలవల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలి. దీర్ఘకాల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనం కంటే సత్యాన్ని చూపాలి. మొత్తంగా చూస్తే, ఉచితాల రాజకీయాలు పూర్తిగా శాపమని చెప్పలేం. కానీ అవి నియంత్రణ లేకుండా కొనసాగితే, సమాజానికి నష్టం కలిగించే అవకాశం ఉంది. అవసరమైన చోట ఉచితాలు ఉండాలి, కానీ అవి ఒక వ్యూహంగా మారకూడదు. ప్రజల సంక్షేమం అనే పేరుతో ఓట్లు కొనే ప్రయత్నం ఆగాలి. ఈ రోజు మనం ఒక కీలక దశలో ఉన్నాం. ఒక దిశలో కొనసాగితే, మనం ఆధారపడి జీవించే సమాజంగా మారిపోతాం. మరో దిశలో ముందు కు సాగితే, మనం స్వయం సమర్థతతో అభివృద్ధి చెందే సమాజంగా మారగలం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న మళ్లీ అదే.. మార్పు ఎవరు తెస్తారు? జవాబు కూడా అదే, మనమే. ప్రజలు మేలుకుంటే, రాజకీయాలు మారతాయి. నాయకులు కూడా మారాల్సి వస్తుంది. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని నిలబెట్టుకోవాల్సి వస్తుంది. ఆ రోజు తప్పకుండా వస్తుంది. కానీ అది స్వయంగా రాదు. మన ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, మన ఓటులో మార్పు వచ్చినప్పుడే, మన సమాజంలో మార్పు వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరం, చైతన్యం, బాధ్యత, దీర్ఘకాల దృష్టి. ఉచితాల మాయ నుండి బయటపడి, అభివృద్ధి మార్గంలో నడవాల్సిన సమయం ఇదే.

# ప్రభుత్వం మెడలు వంచి ప్రతి గింజ కొనేలా చేస్తాం

**ధాన్యం వెంటనే కొనాలి -**

**కేసీఆర్ పాలనలో తక్షణ కొనుగోళ్లు, ఇప్పుడు నెలల తరబడి ఎదురు చూపులు..**

**నర్సంపేటలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్**





**నర్సంపేట, మే 5,అక్షర సవాల్ :**కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను బరాబర్ కొనే విధంగా మెడలు వంచుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మహిళా రైతులతో మాట్లాడారు. మాదన్నపేట, పర్శనాయక్ తండాకు చెందిన రైతులు బార్ధాన్, సుతలి, రవాణా, వెయిటింగ్ చార్జీలన్నీ తమ నుంచే వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేసీఆర్ పాలనలో రైతులు మార్కెట్‌కు తెచ్చిన ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేసి గోదాములకు తరలించేవారని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు మాత్రం మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం కొనుగోలుకు నెలల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.నర్సంపేట మార్కెట్లో 600 టోకెన్లు ఇచ్చినా ఇప్పటివరకు 200 టోకెన్ల వద్దే మొక్కజొన్న కొనుగోలు ఆగిపోయిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. రైతుల నుంచి వసూలు చేస్తున్న ప్రతి పైసా ఆపేలా కృషి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.వర్షాలు పడితే రైతులు తక్కువ ధరలకు అమ్ముకుంటారని, ప్రభుత్వానికి అదే లాభమని భావిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. అలాంటి పరిస్థితి రాకుండా అధికారులతో మాట్లాడి కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాలను వెంటనే తరలించేలా చర్యలు తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు వరంగల్‌లో రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలి

**వరి ధాన్యం సేకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు**



**హైదరాబాద్:** తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలు మరియు భారీ వేసవి జల్లుల నేపథ్యంలో, రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అత్యవసర సమీక్షా సమావేశంలో, ధాన్యం సేకరణ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకవైపు ధాన్యం రాక పెరగడం, మరోవైపు ఈ వారం అంతా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం హై అలర్ట్‌లో ఉంది.ప్రస్తుత రబీ మార్కెటింగ్ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని మొత్తం 8,575 కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు 1.84 లక్షల మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. రైతులకు చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం వేగంగా వ్యవహరిస్తోంది, ఇప్పటికే రూ. 2,001.96 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది.గత రాత్రి -- మిగతా5లో

# గన్‌పాయింట్ దోపిడీపై సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ ఫోకస్

**2 కోట్ల ప్రాపర్టీ దొంగతనం...50 గంటలు గడిచినా జాడ లేదు!**



**హైదరాబాద్:** కరీంనగర్‌లో జరిగిన సంచలన గన్‌పాయింట్ దోపిడీ కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ జిల్లాలోని పీఎంజే జ్యువెలరీ షాపులో జరిగిన ఈ ఘటనలో రెండు కోట్ల ప్రాపర్టీ దొంగతనం జరగగా,50 గంటలు గడిచినా నిందితుల ఆచూకీ లభించకపోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది..ఈ కేసును అత్యంత సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వెంటనే కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కూడా హెచ్చరించినట్లు తెలుస్తోంది.

**"నందుర్బార్" క్లూ తో కొత్త మలుపు.**

ఘటనా స్థలంలో దుండగులు వదిలేసిన బ్యాగుపై "ఐలవ్ నందుర్బార్" అని రాసి ఉండటం కేసులో కీలక క్లూగా మారింది. దీంతో మహారాష్ట్రలోని నందుర్బార్ ప్రాంతంతో సంబంధం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

**16 బృందాలుగా గాలింపు రాష్ట్ర సరిహద్దులు దాటి అన్వేషణ:**

నిందితులను పట్టుకునేందుకు పోలీసులు 16 బృందాలుగా విభజించి, దాదాపు - మిగతా5లో

# రైతును రాజు చేసేంత వరకు విశ్రమించం..

**లక్ష రూపాయల రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందన్న పొంగులేటి**

**గతంలో వరి వేస్తే ఉరి అనే పరిస్థితి ఉండేదన్న మంత్రి**

**సన్న వడ్లకు బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని వెల్లడి**



తమది రైతు పక్షపాత ప్రభుత్వం అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండలో జరిగిన 'మెగా రైతు మేళా'లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందని... కానీ తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నుంచి బయటపడేస్తూనే, రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేసిందని గుర్తుచేశారు. గత హయాంలో 'వరి వేస్తే ఉరి' అన్న పరిస్థితులు ఉండేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు భరోసా కల్పిస్తూ సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వంగా నిలిచిందని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎకరానికి రూ. 12 వేల ఆర్థిక సాయంతో పాటు అత్యాధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 1,200 కోట్లు చెల్లించిందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతును రాజు చేసే వరకు తమ ప్రభుత్వం విశ్రమించబోదని, ప్రతి రైతుకు మద్దతు ధరతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# మోడీ సభ నుంచి ఆపరేషన్ తెలంగాణ



**హైదరాబాద్, మే 5 :**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యటన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఈ సభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టింది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది.రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో దాదాపు రూ.7,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించిన ఈ భారీ కేటాయింపుల ద్వారా తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది.ఈ ఏడాది జరగనున్న జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో - మిగతా5లో

# క్లౌడ్ కంప్యూటింగ్‌లో నూతన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రధానం

## బొల్లికొండకు చెందిన మాలోత్ వీరు ప్రతిభకు గుర్తింపు

**నెక్కొండ,మే 5 అక్షర సవాల్:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామానికి చెందిన మాలోత్ వీరు గ్రామీణ గిరిజన కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యలో అరుదైన విజయాన్ని సాధించి ఆదర్శంగా నిలిచారు. "రోబుస్ట్ సెక్యూరిటీ అండ్ నోవెల్ సర్వీసెస్ లెవెల్ ఫీచర్ ఎన్హాన్స్మెంట్ ఫర్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎన్విరాన్మెంట్" అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్‌లో కంప్యూటర్ శాస్త్ర విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రమేష్ మార్గదర్శకత్వంలో మాలోత్ వీరు తన పరిశోధనను పూర్తి చేశారు. 2022 జూన్ 24న పీహెచ్‌డీ ప్రవేశం పొందిన ఆయన,2026 ఏప్రిల్ 29న డాక్టరేట్‌ను విజయవంతంగా అందుకున్నారు. మాలోత్ వీరు విద్యాభ్యాసం గ్రామీణ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా సాగింది. స్వగ్రామం బొల్లికొండలోనే ప్రాథమిక విద్యను పూర్తిచేసి వరంగల్ ఎల్ బి కళాశాలలో డిగ్రీ,వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసిఏ చేశారు. భావ్‌సింగ్–మారోని దంపతులకు జన్మించి సాధారణ కుటుంబంలో పెరిగి కష్టనష్టాలను అధిగమిస్తూ ఈ స్థాయికి చేరుకోవడం విశేషం. కుటుంబ సభ్యులు అన్న శంకర్,భార్య హేమలత,కుమారులు శ్రీవర్ధన్,విష్ణువర్ధన్ ఆయనకు అండగా నిలిచారు.



**పరిశోధన ప్రత్యేకత**

"క్లౌడ్ కంప్యూటింగ్ పరిసరాలలో దృఢమైన భద్రత మరియు వినూత్న సేవా స్థాయి లక్షణాల మెరుగుదల"అనే అంశంపై మాలోత్ వీరు చేసిన పరిశోధన మేఘ గణన రంగంలో కీలక సవాళ్లకు పరిష్కార మార్గాలను సూచించింది. భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం,సేవల నాణ్యతను మెరుగుపరచడం,డేటా రక్షణను పెంపొందించడం వంటి అంశాలపై ఈ అధ్యయనం దృష్టి సారించింది. ఈ పరిశోధన ద్వారా సురక్షిత ప్రాప్తిని నిర్ధారించడం,సేవల సరఫరా సామర్థ్యాన్ని పెంచడం వంటి అంశాల్లో కొత్త విధానాలను ప్రతిపాదించారు. డిజిటల్ యుగంలో మేఘ గణన ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిశోధన ఐటి సేవలు,డేటా నిర్వహణ,సంస్థల వినియోగ వ్యవస్థలకు ఉపయోగకరంగా నిలవనుంది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ సైన్స్ ఆచార్య జి.హనుమంతు,విభాగాధిపతి డాక్టర్ బి. రామ,సీనియర్ అధ్యాపకులు డాక్టర్ బి. మంజుల,డాక్టర్ నీలిమ,డాక్టర్ సలోని,పూజిత తదితరులు అభినందనలు తెలిపారు. గ్రామీణ,గిరిజన నేపథ్యంతో వచ్చిన యువకుడు పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించడం అనేక మందికి ప్రేరణగా నిలుస్తోంది. కష్టపడితే ఏ లక్ష్యమైనా సాధ్యమేనని మాలోత్ వీరు తన విజయంతో మరోసారి నిరూపించారు. డాక్టరేట్ పట్టా పొందిన వీరు నాయక్‌ను కుటుంబ సభ్యులు,గ్రామస్తులు,తదితరులు అభినందించారు.



# వరంగల్ రైతు సంగ్రామ సదస్సుకు భారీ సమీకరణ పిలుపు

**కాంగ్రెస్ పాలనపై నిరసనగా రేపు హన్మకొండలో సభ**

**బీఆర్ఎస్ నేత సారంగపాని ఆహ్వానం**



**నల్లబెల్లి, మే 05 అక్షర సవాల్:** రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కారం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో కాలక్షేపం చేస్తోందని ఆరోపిస్తూ, రేపు వరంగల్‌లో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సును భారీగా విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డా. బానోతు సారంగపాని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులను నట్టేట ముంచిందని ఆయన విమర్శించారు. హన్మకొండలోని హంటర్ రోడ్డు సీఎస్ఆర్ గార్డెన్ సర్కిల్ వద్ద ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ సదస్సుకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ నేపథ్యంలో మంగళవారం నల్లబెల్లి పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల నాయకత్వంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సారంగపాని మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలనపై ప్రజలు చమరగీతం పాడే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. రైతుల హక్కుల సాధన కోసం ఈ సదస్సు కీలకంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, క్లస్టర్ బాధ్యులు ఇంగ్లీ శివాజీ, మామిండ్ల మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లావుడ్యా తిరుపతి, గ్రామ అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, ఉప సర్పంచ్ గుమ్మడి వేణు, మాజీ ఎంపీటీసీ పోడేటి ప్రకాశం, నాయకులు ఎర్రబెల్లి రాజు, వైనాల మధు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# మక్కజొన్న తరలింపులో గందరగోళం...

**కేంద్రాల వద్ద రైతుల రాత్రింబవళ్లు వేచి చూడటం**

**లారీల లేమితో గోదాములకు చేరని పంట**

**అకాల వర్షాల భయంతో రైతుల్లో తీవ్ర ఆందోళన**

**నల్లబెల్లి, మే 05 అక్షర సవాల్:** జిల్లాలో మక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కొనుగోలు చేసిన మక్కజొన్నను గోదాములకు తరలించడంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు కుటుంబాలతోనే కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. లారీల రాకలో ఆలస్యం, హమాలీల కొరత కారణంగా కేంద్రాల్లో పంట పేరుకుపోయి రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. నల్లబెల్లి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ఏప్రిల్ 8వ తేదీ నుంచి కాంటా అయిన మక్కజొన్నలు ఇప్పటికీ అక్కడే నిల్వగా ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పీఏసీఎస్ సిబ్బంది సరిపడ వాహనాలను ఏర్పాటు చేయడంలో విఫలమవడంతో సమస్య మరింత ముదురుతోంది. ప్రభుత్వం పిలిచిన టెండర్ల ద్వారా ఎంపికైన కాంట్రాక్టర్లకు ఇప్పటివరకు అగ్రిమెంట్ పత్రాలు అందకపోవడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. అధికారిక హామీలు లేకుండా వాహనాలను నడపలేమని కాంట్రాక్టర్లు స్పష్టం చేయడం పరిస్థితిని సంక్లిష్టంగా మార్చింది. ఇక అకాల వర్షాల ముప్పు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో ఆరుబయట నిల్వ ఉంచిన మక్కజొన్నలు తడిసిపోతాయనే భయం వారిని వెంటాడుతోంది. వర్షం పడితే కేంద్రాలు బురదమయంగా మారి, వాహనాలు లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా జరిగిన ఘటనలు రైతుల్లో భయాందోళనలను పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో లారీ కాంట్రాక్టర్ సమస్యలను వెంటనే పరిష్కరించి లేదా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించి వాహనాలను సమకూర్చాలని, నిల్వలో ఉన్న మక్కజొన్నను తక్షణమే గోదాములకు తరలించి రైతులకు ట్రక్ షీట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని యంత్రాంగం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.



# ఎస్ఐ సాయి ప్రసన్నకుమార్‌కు ఘన సన్మానం..

**శాంతి భద్రతలే లక్ష్యమని స్పష్టం**

**మూడు చెక్కలపల్లి సర్పంచ్ మర్యాదపూర్వక భేటీ..**




**నల్లబెల్లి, మే 5 అక్షర సవాల్:** నల్లబెల్లి మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సాయి ప్రసన్నకుమార్ను మూడు చెక్కలపల్లి సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడటం తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో నల్లబెల్లి మండలాన్ని శాంతియుత వాతావరణంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండల అభివృద్ధి, ప్రజల భద్రత కోసం సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ కవిత దేవు నాయక్ సూచించారు. ఈ భేటీ సానుకూల వాతావరణంలో సాగింది.

# తుప్పరి సూర్యనారాయణ స్మారకంగా రూ.50,116 విరాళం

**రాంపూర్ అభయాంజనేయ ఆలయ నిర్మాణానికి విశేష మద్దతు**

**అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి ఆదేశాలతో దాతృత్వం -- గ్రామస్తుల కృతజ్ఞతలు వెల్లువ**



**గీసుగొండ, మే 5 అక్షర సవాల్:** రాంపూర్ గ్రామంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి విశేష సహకారం అందింది. అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి ఆదేశానుసారంగా, కీర్తిశేషులు తుప్పరి సూర్యనారాయణ స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ. 50,116 భారీ విరాళాన్ని అందజేశారు. ఈ విరాళం ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు కొత్త ఊపునిచ్చింది. గీసుకొండ మాజీ జడ్పిటిసి తుప్పరి సూర్యనారాయణ కుమారుడు తుప్పరి వికాస్ ఈ మొత్తాన్ని అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి, అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా రాంపూర్ సర్పంచ్ రడం భరత్, ఆలయ చైర్మన్ తాబేటి వెంకటేశ్వర్లు వారికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొని, ఆలయ నిర్మాణం పట్ల ప్రజల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో మనుగొండ సర్పంచ్ పేర్ల శ్రవణ్, గీసుకొండ మాజీ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్, మాదాసి రాంబాబు, చాపర్తి కనకయ్య, యాగోని రజనీకాంత్, ఓదెల సురేష్, బుసాని సాంబయ్య, కందికొండ రాజు, దర్శనాల రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

# రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి

**సీపీఎం ఆందోళన హెచ్చరిక**

**కాజీపేట, అక్షర సవాల్ :** కాజీపేట అయోధ్యపురంలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ఉద్యోగాలు సాధించే వరకు సీపీఎం దశలవారీ ఆందోళనలకు సిద్ధమవుతోందని సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జిల్లా నాయకులు కారు ఉపేందర్ లు ప్రకటించారు. సోమవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అయోధ్యపురంలోని భూ నిర్వాసితులతో కలిసి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. అనంతరం మండల కమిటీ సభ్యుడు సంటి రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూసేకరణ చేసినప్పుడు రైల్వే అధికారులు, ప్రభుత్వం భూములు కోల్పోయిన అయోధ్యపురం రైతులకు ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి




సిద్ధమవుతున్నా హామీ అమలు కాలేదని విమర్శించారు. భూమి ఇచ్చిన రైతులు అటు భూమి, ఇటు ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్నారని, మహిళలు సైతం అదే ఫ్యాక్టరీలో కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గత కొన్ని నెలలుగా రైల్వే జేఏసీ, కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అయోధ్యపురం రైతులకు, స్థానిక నిరుద్యోగ యువకులకు, రైల్వేలో అప్రెంటిస్ చేసిన వారికి మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంటి రవి, కాదాసీ రామస్వామి, భూ నిర్వాసితులు మామిళ్ల బిక్షపతి, ఇలా సాగరం ప్రదీప్, ఐలయ్య, కాగిత సందీప్, శ్రీనివాస్, సురేష్, పూల మణికంఠ, మామిళ్ల సతీష్, నవీన్, ఉప్పు వెంకటేష్, శేషు, దొంగల లక్ష్మి, ఉప్పు లక్ష్మి, జక్కుల సునీత, భైరవైన మనమ్మ, వేల్పుల కవిత తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి ట్యాంక్ బండ్‌ను ప్రజలకు అంకితం..

**మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ...**



**వరంగల్ ప్రతినిధి అక్షర సవాల్** :బల్దియా పరిధి 29వ డివిజన్ భద్రకాళి ట్యాంక్ బండ్‌పై గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. 84.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం సంయుక్తంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి అంకితం చేశారు. మంగళవారం బండ్ ప్రారంభం అనంతరం వారు మాట్లాడుతూ..బండ్‌కు ఒక వైపు భద్రకాళి దేవాలయం, మరో వైపు పద్మాక్షి ఆలయం, సిద్దేశ్వరుల గుట్ట ఉండటంతో ఈ ప్రాంతం పర్యాటకానికి వన్నె తెస్తుందని మంత్రులు అన్నారు. నగరానికి మణిహారంగా ఉన్న భద్రకాళి బండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు,జిల్లా కలెక్టర్, బల్దియా ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారదతదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ హాజరుతో హనుమకొండలో 'రైతు సంగ్రామ సదస్సు' రగడ ...

**కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఘాటు దాడి**

**రైతుల సమస్యలపై సదస్సు... అవరోధాలపై ఆరోపణలు...**

**రాజకీయంగా వేడెక్కిన వాతావరణం**

**హనుమకొండ, మే 05 అక్షర సవాల్:** హనుమకొండలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ నేతలు రేపు జరగనున్న రైతు సంగ్రామ సదస్సును రాజకీయంగా కీలకంగా మార్చారు. ఈ సదస్సుకు కె. టి. రామ రావు హాజరవుతారని మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. సదస్సు ద్వారా రైతుల సమస్యలను బలంగా ప్రజల ముందుకు తీసుకువస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాలనలో వ్యవసాయం పండుగలా మారిందని, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పంటల కొనుగోళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న రైతులు నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంగ్రామ సదస్సుకు పోటీగా రైతు మేళాలు నిర్వహిస్తూ దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందని,



తమ కార్యక్రమానికి అడ్డంకులు సృష్టిస్తూ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన తోరణాలు, ఫ్లెక్సీలను తొలగిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎంఎల్సీ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు తక్కువగా ఉన్న ధాన్యం ఉత్పత్తి కేసీఆర్ నాయకత్వంలో గణనీయంగా పెరిగిందని చెప్పారు. రైతులను ఆర్థికంగా బలపర్చడం లక్ష్యంగా పనిచేశారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రైతు రుణమాఫీ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయలేదని, రైతుబంధు పథకం అమలులో నిర్లక్ష్యం చూపిందని మండిపడ్డారు. అదేవిధంగా బి. వినోద్ కుమార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే అనుసరిస్తోందని పేర్కొన్నారు. ఎంఎల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని అన్నారు. రేపు ఉదయం 9 గంటలకు రైతు సంగ్రామ సదస్సు ప్రారంభమవుతుందని ఎంఎల్సీ తకెళ్ళ రవీందర్ రావు తెలిపారు. యూరియా కొరత, పంటల కొనుగోళ్ల లోపం వంటి అంశాలపై సదస్సులో గళమెత్తుతామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే నన్నపూనేని నరేందర్ పోలీసులను ఉపయోగించి సదస్సును అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, అన్ని అడ్డంకులను అధిగమించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ రైతు సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే ఈ సదస్సు లక్ష్యమని, కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని ఆరోపించారు. మొత్తంగా, హనుమకొండలో జరగనున్న రైతు సంగ్రామ సదస్సు రాజకీయంగా వేడి రగిలిస్తుండగా, బీఆర్ఎస్–కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మరింత ఉధృతమవుతోంది.

# శాస్త్రవేత్తల సలహాలతో సాగుకు కొత్త దారి

**రంగాపురంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం**

**ఖర్చు తగ్గించి లాభాలు పెంచే మార్గాలు వెల్లడింపు**



**నల్లబెల్లి, మే 05 అక్షర సవాల్:** వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో పాటు ఖర్చు తగ్గింపు, నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంతో రంగాపురం గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఎఆర్ఎస్) వరంగల్‌కు చెందిన సీనియర్ కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. ఓం ప్రకాష్ రైతులకు సమగ్ర మార్గదర్శకాలు అందించారు. వ్యవసాయంలో యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని, సాగు ఖర్చులను నియంత్రించవచ్చని ఆయన వివరించారు. పంట మార్పిడి విధానాలను పాటించడం ద్వారా రైతులు స్థిర ఆదాయం పొందవచ్చని, రసాయన మందుల వినియోగాన్ని పరిమితం చేసి ప్రకృతి స్నేహ పద్ధతులను అనుసరించాలని సూచించారు. అలాగే సాగునీటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నీటి ఆదా సాధ్యమని, సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో బి. రజిత, ఏఈఓ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి రామారావు, ఉప సర్పంచ్ కస్తూరోజు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన గ్రామ రైతులు శాస్త్రవేత్తల సూచనలను శ్రద్ధగా విన్నారు. రైతులు ఈ సూచనలను ఆచరణలో పెట్టి అధిక దిగుబడులతో పాటు లాభాలు సాధించాలని గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు ఆకాంక్షించారు.

# టి.పి.ఏ 9 ఏళ్ల సేవా ప్రస్థానం పూర్తి

**దశాబ్ద లక్ష్యాలకు ఘన ఆరంభం**

**మానసిక ఆరోగ్య విస్తరణకు సమగ్ర కార్యాచరణ... గ్రామాల దాకా సైకాలజీ సేవలే లక్ష్యం**




**గీసుగొండ, మే 5 అక్షర సవాల్:** తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టి.పి.ఏ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గీసుగొండ మండల సమాఖ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా అధ్యక్షుడు పోగు అశోక్, జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీలత, ఉపాధ్యక్షుడు బొజ్జ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం మహిళల విస్తృత పాల్గొనికతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొమ్మిదేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సంఘం, పదవ వసంతంలోకి అడుగుపెడుతున్న ఈ సందర్భంలో భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశను వెల్లడించింది. ఈ సందర్భంగా మాట్లాడిన సంఘం నాయకులు సమాజంలో పెరుగుతున్న మానసిక సమస్యలను తగ్గించడం అత్యవసరమని పేర్కొంటూ, టి.పి.ఏ ప్రారంభం నుంచే ఆ దిశగా నిరంతర కృషి చేస్తోందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాల ద్వారా వేలాది మంది విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. 2017 మే 5న హైదరాబాద్‌లో డా. మోతుకూరి రాంచందర్ నాయకత్వంలో ప్రారంభమైన ఈ సంఘం, క్రమంగా తన సేవలను విస్తరించుకుంటూ నేడు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన సైకాలజీ రంగం, ప్రస్తుతం ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే స్థాయికి చేరుకోవడం టి.పి.ఏ కృషి ఫలితమని స్పష్టం చేశారు. "ప్రజల మానసిక ఆరోగ్య భద్రతే మా ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేసిన నాయకత్వం, రాబోయే దశాబ్దంలో ప్రతి పాఠశాల, ప్రతి కార్యాలయం, ప్రతి గ్రామంలో సైకాలజిస్టుల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పం వ్యక్తం చేసింది. మానసిక అనారోగ్యంపై ఉన్న అపోహలను తొలగిస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొంది. ఈ కార్యక్రమంలో పోగు అశోక్, డాక్టర్ శ్రీలత, బొజ్జ సురేష్‌తో పాటు సభ్యులు పవన్ కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రాధిక, కార్యదర్శి శారద, కోశాధికారి శిల్ప, ఏపిఎం ఈశ్వరయ్య, సీసీలు, అకౌంటెంట్ జయంతిక, ఆపరేటర్ నాగరాజు, వివిధ గ్రామాల ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "మానసిక ఆరోగ్యమే మహా సేవ" అనే సందేశంతో టి.పి.ఏ దశాబ్ద దిశగా ముందుకు సాగుతోంది.

# డిఆర్డిఓ నాగ పద్మజ ఆకస్మిక తనిఖీ

**ఉపాధి హామీ పనుల్లో కఠిన కసరత్తు**


**లేబర్ మొబిలైజేషన్‌కు కొత్త వ్యూహం -- రూ.307 వేతన లక్ష్యంతో వేగం పెంపు**




**గీసుగొండ, మే 5 అక్షర సవాల్:** పరిపాలనా దృఢత్వాన్ని స్పష్టంగా చాటుతూ గీసుగొండలో ఉపాధి హామీ పనులపై డిఆర్డిఓ అధికారిణి కె. నాగ పద్మజ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనుల అమలు, లేబర్ హాజరు, వేతనాల విధానం వంటి కీలక అంశాలను లోతుగా పరిశీలించిన ఆమె, పనుల వేగం పెంపులో నిర్లక్ష్యం అస్సలు సహించబోమని అధికారులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. లేబర్ మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించిన ఆమె, ప్రతి మహిళా సంఘం నుంచి సభ్యులు తప్పనిసరిగా ఉపాధి హామీ పనులకు హాజరు కావాలని ఆదేశించారు. ప్రతి 40 మంది వేతనదారులకు ఒక వర్కింగ్ మేట్ నియమించి, సమర్థవంతంగా కార్మికులను సమీకరించే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రోజుకు ప్రతి వేతనదారుకు రూ.307 వేతనం అందేలా పనులను శాస్త్రీయంగా అమలు చేయాలని స్పష్టం చేస్తూ, ఉపాధి హామీ నిధుల వినియోగాన్ని గరిష్ట స్థాయికి తీసుకెళ్లాలని ఆదేశించారు. మండలంలోని ప్రతి గ్రామంలో కనీసం 150 మంది డిమాండ్ నమోదు చేసి, 100 మందితో పనులు అమలు చేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. పని ప్రదేశాల్లో నీడ, త్రాగునీరు, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, జీరో టాలరెన్స్ విధానం కఠినంగా అమలు చేయాలని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఏపీవో చంద్రకాంత్, ఈసీ శ్రీలత, టీఏ సుష్మ, పీఎస్ పోలు రాజేంద్రప్రసాద్, క్లస్టర్ టీఏ సురేష్, విఒఎలు, గ్రామపంచాయితీ సిబ్బంది, మేట్లు పాల్గొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీతో ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత, వేగం, సమర్థత పెంపుకు అధికార యంత్రాంగానికి స్పష్టమైన హెచ్చరికతో పాటు దిశానిర్దేశం లభించింది.

# జలంధర్ రెడ్డికి కీలక బాధ్యత

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియామకం -- ఆత్మకూరులో సంబరాలు**



**ఆత్మకూరు, మే 5 అక్షర సవాల్:** పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన రేవూరి జలంధర్ రెడ్డిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించారు. ఈ నియామకాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఆత్మకూరు మండలంలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున జలంధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వం కీలకమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జలంధర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో ఈ బాధ్యత అప్పగించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అలాగే మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని, ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు తీసుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ నియామకం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని నేతలు అభిప్రాయపడుతున్నారు.

# రైతు సంక్షేమానికి దిశానిర్దేశం

**హనుమకొండలో ఘనంగా మెగా రైతు మేళా ప్రారంభం**








**హనుమకొండ, మే 5 అక్షర సవాల్:** రాష్ట్రంలో రైతు అభివృద్ధికి కొత్త దిశగా అడుగులు వేస్తూ హనుమకొండలో రాష్ట్ర స్థాయి 'మెగా రైతు మేళా' ఘనంగా ప్రారంభమైంది. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల మేళాకు తొలి రోజే రైతుల నుండి విశేష స్పందన లభించింది. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు స్పష్టం చేస్తూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు రైతులకు చేరవేయడంలో ఇటువంటి మేళాలు కీలకమని పేర్కొన్నారు. మేళాలో రైతులకు ఉపయోగపడే విధంగా పలు విభాగాలను ఏర్పాటు చేసి, వ్యవసాయ సాంకేతికతలు, పథకాలపై అవగాహన, నిపుణుల సలహాలు అందిస్తున్నారు. రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు ప్రత్యేక సేవా కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయని రాజేందర్ రెడ్డి, నాగరాజు, మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. తొలి రోజే భారీగా రైతులు తరలిరావడంతో ప్రాంగణం సందడిగా మారింది. మూడు రోజుల పాటు కొనసాగే ఈ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# దాడి శివకు కీలక బాధ్యత

**గీసుకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకం -- శ్రేణుల్లో ఉత్సాహం**



**గీసుకొండ, మే 5 అక్షర సవాల్ :** పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు తీసుకొచ్చేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. గీసుకొండ మండలానికి చెందిన దాడి శివను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించారు. ఈ నియామకాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో గీసుకొండ మండలంలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున దాడి శివకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వం కీలకమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దాడి శివ మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో ఈ బాధ్యత అప్పగించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వరంగల్ డిసిసి అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్, అలాగే మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని, ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు తీసుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ నియామకం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని నేతలు అభిప్రాయపడుతున్నారు.

# ఉపాధి హామీ పనులపై కఠిన దిశానిర్దేశం

**ప్రతి గ్రామంలో 100 మందికి ఉపాధి లక్ష్యం**

**వివో నేతలకు అలర్ట్**

**మహిళల భాగస్వామ్యం పెంపు, ఎన్ఎంఎంఎస్ హాజరుపై ప్రత్యేక దృష్టి**




**గీసుగొండ, మే 5 అక్షర సవాల్:** ప్రగతి మండల సమాఖ్యలో జరిగిన వివో అధ్యక్షుల కీలక సమావేశంలో ఉపాధి హామీ పనుల అమలుపై అధికారులు కఠిన సూచనలు జారీ చేశారు. సమావేశానికి హాజరైన ఈజీఎస్ ఎపిఒ చంద్రకాంత్, ఏపీఎం ఈశ్వర్ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 100 మందికి పైగా వేతనదారులను తక్షణం పనుల్లో నిమగ్నం చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి వివో లీడర్ తమ గ్రూప్ సభ్యులను సమర్థంగా మొబిలైజ్ చేసి, ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా చైతన్యపరచాలని ఆదేశించారు. మహిళా సంఘాలు ముందుండి సిబ్బందికి పూర్తి సహకారం అందించి వేతనదారుల సంఖ్యను పెంచడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో పని చేసిన వారికే షెడ్ల నిర్మాణం, హార్టికల్చర్, ఇంకుడు గుంతలు, భూమి అభివృద్ధి వంటి వ్యక్తిగత పనుల లాభాలు అందుతాయని అధికారులు స్పష్టం చేశారు. దీంతో పనుల్లో పాల్గొనడం తప్పనిసరి అని తెలియజేశారు. అలాగే ప్రతి 40 మంది వేతనదారులకు ఒక వర్కింగ్ మేట్‌ను నియమించుకోవాలని, అందులో కనీసం 50 శాతం మహిళలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వర్కింగ్ మేట్స్ ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు నమోదు సమయానికి జరిగేలా పర్యవేక్షిస్తారని తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయం పెంచి వేతనదారుల సంఖ్యను గణనీయంగా పెంచాలని మహిళా సంఘ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి రాధిక, శారద, శిల్ప, ఏపీఎం ఈశ్వర్, సీసీలు సురేష్, నర్సయ్య, శ్రీలతతో పాటు వివిధ గ్రామాల వివో ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డీసీసీ సభ్యులుగా ఎన్నికైన మామిండ్ల సురేష్‌కు ఘన సన్మానం

**కాంగ్రెస్‌కు విశిష్ట సేవలకు గుర్తింపు**



**హనుమకొండ,అక్షర సవాల్:** కాంగ్రెస్ పార్టీకి విశిష్ట సేవలు చేసినందుకుగాను హన్మకొండ డీసీసీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన మామిండ్ల సురేష్ ను రాజరాజేశ్వరి ఆటో అధ్యక్షులు వేల్పుల సాంబమూర్తి,ఆవునూరి లక్ష్మణ్, ఎండి షఫీ, టేకుమట్ల మహేష్ తదితరులు సురేష్‌ను శాలువాతో సత్కరించి పూలమాల వేసి అభినందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన మామిండ్ల సురేష్‌కు ఈ పదవి దక్కడం సంతోషదాయకమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. డీసీసీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా మామిండ్ల సురేష్ మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తానని, పార్టీ ఇచ్చిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

# దోపిడీ వెనుక ఆ ముఠా

**కరీంనగర్, మే 5:** ప్రశాంతతకు మారుపేరైన ఆ నగరం ఉలిక్కిపడింది. నిత్యం రద్దీగా ఉండే ఆ వీధి, పసిడి కాంతుల మధ్య వెలిగిపోయే ఒక వాణిజ్య సముదాయం అల్లకల్లోలంగా మారింది. ఆయుధాలతో వచ్చిన దుండగులు క్షణాల్లో చేసిన అలజడి కేవలం ఆస్తి నష్టాన్ని మాత్రమే కాదు.. పౌరుల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తారు. పట్టపగలే కాల్పుల శబ్దాలతో దద్దరిల్లిన ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొనగా, అప్పటి వరకు సాధారణంగా సాగిపోతున్న జనజీవనం స్తంభించింది. ఇప్పుడు ఆ ముఠా ఎక్కడుంది? ఎటు వెళ్లింది? అన్న ఉత్కంఠ నెలకొన్న తరుణంలో, పోలీసులు ఒక కీలకమైన ప్రకటనతో ముందుకు వచ్చారు మాజీ ఎమ్మెల్యే కుమారుడికి షాకిచ్చిన పోలీసులు కరీంనగర్‌లో కలకలం రేపిన పీఎంజే చోరీ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ నగరంలోని రద్దీ ప్రాంతంలో పీఎంజే జువెలరీ షాపులో జరిగిన కాల్పులు, చోరీ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. నిందితులు పక్కా ప్లాన్‌తో వచ్చి, సిబ్బందిని బెదిరించి బంగారం అపహరించడమే కాకుండా కాల్పులకు తెగబడడం పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై స్పందించిన పోలీస్ శాఖ, నిందితుల వేటను ముమ్మరం చేసింది. ఘటనా స్థలంలో సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సాక్ష్యాల ప్రకారం.., ఇది ఒక ప్రణాళికాబద్ధమైన నేరమని అధికారులు నిర్ధారించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ కేసు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బయటపడ్డ ముఖచిత్రాలు నేరం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, జువెల్లరీ, పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు.




ఐదుగురు నిందితులకు సంబంధించిన స్పష్టమైన చిత్రాలు సేకరించారు. ఈ ఫుటేజీ ఆధారంగా నిందితుల ముఖచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. ప్రజలు ఈ ముఖాలను గుర్తించి, పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ఈ నిందితులు ఎక్కడైనా తలదాచుకొని ఉండవచ్చని, వారిని పట్టుకోవడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ముఖచిత్రాల విడుదల చేసి వారు తప్పించుకునే మార్గాలను మూసివేయాలని అధికారులు భావిస్తున్నారు దర్యాప్తులో తేలిన మరో దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే, ఈ చోరీకి పాల్పడింది ఒక అంతర్రాష్ట్ర ముఠా అని గుర్తించారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి, రెక్కీ నిర్వహించి నేరానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ప్రమాదకరమైన ముఠాను పట్టుకోవడానికి 12 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక్కో బృందం ఒక్కో కోణంలో గాలింపు చేపడుతోంది. సరిహద్దు ప్రాంతాలతో పాటు, నిందితులు వెళ్లేందుకు అవకాశం ఉన్న అన్ని రహదారులను జల్లెడ పడుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి సెల్ ఫోన్ సిగ్నల్స్, ప్రయాణ మార్గాలను విశ్లేషిస్తున్నారు. ఆచూకీ తెలిపితే లక్ష ఈ కేసులో పురోగతి సాధించేందుకు పోలీసులు ప్రజలకు భారీ ఆఫర్ ప్రకటించారు. నిందితుల ఆచూకీ తెలిపిన వారికి లేదంటే ఎక్కడ ఉన్నారో సమాచారం అందించిన వారికి రూ. 1,00,000 (లక్ష) నగదు అందజేస్తామని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. నిందితుల కదలికలపై అనుమానం ఉన్నవారు స్పందించాలని, తద్వారా ఈ అంతర్రాష్ట్ర నేరగాళ్లను కటకటాల్లోకి నెట్టే అవకాశం ఉంటుందని పోలీసులు పిలుపునిచ్చారు. సంప్రదించాల్సిన నంబర్లు నిందితుల గురించి సమాచారం తెలిసిన వారు నేరుగా పోలీసు అధికారులకు ఫోన్ చేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా 8712670762, 8712670711, 8712670713 నంబర్లను కేటాయించారు. ఈ నంబర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని, ఏ చిన్న సమాచారం అయినా కేసు దర్యాప్తునకు సహాయపడుతుందని పోలీసులు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో పౌర సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసులకు తోడ్పాటు అందించాలని కోరుతున్నారు. ఈ సాహసోపేత చర్య ద్వారా నేరగాళ్లను పట్టుకొని, నగరంలో మళ్లీ మునుపటి ప్రశాంతతను నెలకొల్పడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోంది.

# ఎల్ నినో సూపర్ ఎల్ నినోగా ఎందుకు మారుతోందా...

ఈసారి ప్రకృతి తన వికృత రూపాన్ని ప్రదర్శించబోతోంది. 2026లో దేశం నిప్పుల కొలిమిలా మారుతోంది. రాబోయే రోజుల్లో ఆహార కొరత సామాన్యుడిని వేధించబోతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సూపర్ ఎల్ నినో కేవలం వాతావరణ మార్పు మాత్రమే కాదని దేశ ఆర్థిక వ్యవస్థను, సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేయగల శక్తి ఉంది. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే ఒక అసాధారణ వాతావరణ పరిస్థితి. సాధారణంగా పసిఫిక్ మహాసముద్రం తూర్పు, మధ్య భాగాలలో నీటి ఉష్ణోగ్రతలు పెరగడాన్ని ఎల్ నినో అని పిలుస్తారు. సాధారణం పరిస్థితుల్లో భూమధ్యరేఖ వెంబడి వీచే ట్రేడ్ విండ్స్ వేడి నీటిని ఆసియా వైపు నెట్టివేస్తాయి. కానీ ఎల్ నినో సమయంలో ఈ పవనాలు బలహీనపడతాయి. దీని వల్ల వేడి నీరు వెనక్కి అమెరికా తీరం వైపు వెళ్తుంది. ఈ మార్పుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఫలితంగా ఒక చోట అతివృష్టి మరోచోట తీవ్రమైన కరవు ఏర్పడుతుంది. వాతావరణ నిపుణుల అంచనా ప్రకారం, 2026లో ఏర్పడబోయే ఎల్ నినో గత 140 ఏళ్లలో అత్యంత శక్తివంతమైనదిగా ఉండబోతోంది. యూర్‌కు చెందిన అధునాతన వాతావరణ నమూనాలు దీనిని మెగా ఎల్ నినో గా అభివర్ణిస్తున్నారు. సముద్ర మట్టం ఉష్ణోగ్రతలుగా సాధారణం కంటే చాలా ఎక్కువగా పెరగడం వల్ల దీని ప్రభావం కూడా అంతే తీవ్రంగా ఉండబోతోంది. ఇది 1877 నాటి భయంకరమైన కరవు పరిస్థితులను గుర్తుకు తెచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. భారత్ దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. దేశంలోని దాదాపు 51 శాతం వ్యవసాయ పనులు వర్షంపై ఆధారపడి ఉన్నాయి. సూపర్ ఎల్ నో ప్రభావంతో 2026లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. వర్షాలు సరిగా లేకుంటే పంట దిగుబడి తగ్గి, రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తూర్పు, వాయవ్య, దక్షిణ భారత్‌లో సాధారణం కంటే ఎక్కువ వడగాల్పులు వీయవచ్చు. కేవలం పగటిపూట మాత్రమ కాదు, రాత్రి ఉష్ణోగ్రతలు కూడా అధికంగా ఉండటం వల్ల మానవ శరీరం చల్లబడే అవకాశం దొరకదు. ఇది ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. పంట ఉత్పత్తి తగ్గడం




వల్ల ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. సాధారణ ఎల్ నినో సమయాల్లోనే ఆహార ధరలు 5 శాతం వరకు పెరుగుతాయి. సూపర్ ఎల్ నినో వస్తే మాత్రం ఈ పెరుగుదల మరింత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపుతుంది. చెట్లు స్థానిక ఉష్ణోగ్రతను 12 డిగ్రీల వరకు తగ్గించ గలవు. కాబట్టి ఉన్న చెట్లను కాపాడుకోవడంతోపాటు కొత్త మొక్కలు నాటడం మంచిది. : ఎండ వేడికి ప్రజలు అబ్బా అంటున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడి భగభగలు. బయటకు వెళితే చమటలు పట్టిస్తున్న వేడి సెగలు .ఇంట్లో ఉంటే ఉక్కపోత సెగలు. ఇదీ వేసవి పరిస్థితి. మధ్యాహ్నం తర్వాత పరిస్థితి మరింత దారుణం. బయటకు వెళితే క్షేమంగా తిరిగి వస్తామా అన్నట్లు ఉంది పరిస్థితి. కొందరు వేడి కారణంగా అనారోగ్యానికి గురవుతుండగా మరికొందరు వడదెబ్బతో ప్రాణాలు కోల్పోతున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే డజన్ల కొద్దీ వడదెబ్బ మరణాలు సంభవించాయన్న వాస్తవం. ఈ సంక్షోభ తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటిన నేపథ్యంలో మే నెలలో వడదెబ్బ ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రాకపోవడం ఉత్తమం. తగినంత నీరు తాగడం, ఓఆర్ఎస్ వాడటం ద్వారా డీహైడ్రేషన్ నుంచి తప్పించుకోవచ్చు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, అడవుల సంరక్షణ ద్వారా దీర్ఘకాలికంగా ఇటువంటి వాతావరణ మార్పులను అడ్డుకోవచ్చు. వేసవి వచ్చిన ప్రతిసారి కలవరపెట్టే అంశం వడదెబ్బ. వడదెబ్బ బారిన పడి ప్రతిసారి అనేక మంది ప్రాణాలు కోల్పోతూ ఉండగా తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా ఈసారి కూడా మరణాలు నమోదయ్యాయి. తెలంగాణలో ఏప్రిల్ 25న ఒక్క రోజే ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ వేసవిలో దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు సంభవించిన వడదెబ్బ మరణాల గురించి కచ్చితమైన సమాచారం లేకున్నా వివిధ రాష్ట్రాల్లో రోజూ పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిసింది. ఇందులో ఎక్కువగా పొలం పనులు చేసేవారు, పని మీద బయటకు వెళ్లిన వారే ఉంటున్నారు. ఏప్రిల్‌లో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మే మాసంలో ఎండలు మరింత విరుచుకపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మరో నెల రోజుల్లో వడదెబ్బ మరణాలు పెరగవచ్చనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

# 45.84 శాతం బెంగాళీల ఓట్లు బీజేపీకే

పశ్చిమ బెంగాల్లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించుతూ బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించింది. ఈ గెలుపు వెనుక బీజేపీకి లభించిన ఓట్ల శాతం కీలక పాత్ర పోషించింది. బీజేపీ ఏకంగా 45.84 శాతం ఓట్లను కైవసం చేసుకోగా, అధికార టీఎంసీ 40.80 శాతం ఓట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. ఈ గణనీయమైన ఓట్ల వ్యత్యాసమే బీజేపీకి స్పష్టమైన మెజారిటీని అందించింది. ఇక అసోంలో కూడా బీజేపీ తన పట్టును నిలబెట్టుకుంది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ, 37.81 శాతం ఓట్ల శాతాన్ని నమోదు చేసింది. కాంగ్రెస్ పార్టీ 29.84 శాతం ఓట్లతో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది.

మలుపులు తిరిగిన తమిళ రాజకీయాలు

తమిళనాడు రాజకీయాల్లో ఈ ఎన్నికలు ఒక పెను సంచలనాన్ని సృష్టించాయి. సినీ నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ తన తొలి ఎన్నికలతోనే రాజకీయ యవనికపై చెరగని ముద్ర వేసింది. ఏకంగా 34.92 శాతం ఓట్ల శాతంతో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీంతో రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. దశాబ్దాలుగా తమిళ రాజకీయాలను శాసిస్తున్న ద్రావిడ పార్టీలైన డీఎంకే 24.19 శాతం, అన్నాడీఎంకే 21.21 శాతం ఓట్ల శాతాన్ని సాధించాయి. టీవీకే రాకతో తమిళ రాజకీయాలు ముక్కోణపు పోటీగా మారాయని ఈ ఓట్ల శాతం స్పష్టం చేస్తోంది.

# విద్యుత్ ఒప్పందాలపై సీబీఐ విచారణ..

- మొదటి పేజీ తరువాయి

విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని విచారణ కమిషన్ ఈ అంశంపై సమర్పించిన 114 పేజీల నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం, భద్రాద్రి (4x270 మెగావాట్లు), యాదాద్రి (5x800 మెగావాట్లు) థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవినీతి, ప్రజాధనం దుర్వినియోగం జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదికపై అడ్వకేట్ జనరల్ నుంచి న్యాయసలహా తీసుకున్న తర్వాతే కేబినెట్ ఈ నిర్ణయానికి వచ్చింది. ఈ ఒప్పందాలలో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ మధ్య అంతర్రాష్ట్ర అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రమేయం కూడా ఉన్నందున, సీబీఐ విచారణే సరైనదని కేబినెట్ అభిప్రాయపడింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల తర్వాత రేవంత్ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరిన రెండో ప్రధాన అంశం ఇదే కావడంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కేబినెట్ భేటీ అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ కేసును త్వరగా సీబీఐకి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ధాన్యం సేకరణ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలి

- మొదటి పేజీ తరువాయి



కురిసిన భారీ వర్షాలకు నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ముఖ్యంగా నల్గొండలో సుమారు 300 మెట్రిక్ టన్నుల ధాన్యం నీటిపాలైంది. ఈ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను అమలు చేస్తోంది. తడిసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని, వాతావరణ హెచ్చరికల ప్రకారం ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తగినన్ని తార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అదనంగా, జిల్లాల్లో 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేలా బఫర్ స్టోరేజ్ సామర్థ్యాన్ని కూడా సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు తమకు కేటాయించిన జిల్లాల్లో స్వయంగా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని కోరారు. రవాణాలో ఇబ్బందులు లేకుండా 18.5 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచామని, అకాల వర్షాల నుండి రైతుల కష్టాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని ఆయన పునరుద్ఘాటించారు.

## జూన్ 2 లోపు కేబినెట్ విస్తరణ

- మొదటి పేజీ తరువాయి

ఉన్నారు. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఈసారి కేబినెట్ లో చోటు దక్కుతుందా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. అయితే కోమటిరెడ్డి సోదరుల్లో ఒకరికే అవకాశం అనే నిబంధనను అధిష్ఠానం తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఒకవేళ రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పించాల్సి వస్తే, వెంకట్‌రెడ్డిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. పైగా సీఎం రేవంత్ రెడ్డితో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి గ్యాప్ వచ్చినట్లు సమాచారం.మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండబోతున్నాయని తెలియగానే పలువురు సీనియర్లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్టీ కోటాలో మహబూబాబాద్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, బాలూ నాయక్ మధ్య పోటీ నెలకొంది. బీసీ కోటాలో మున్నూరు కాపు వర్గం నుండి ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. ఇక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా మంత్రివర్గంలో చోటుకోసం ప్రయత్నిస్తున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సైతం కేబినెట్ లోకి వెళ్లాలని ఆశిస్తున్నట్టు సమాచారం.కేవలం కేబినెట్ మాత్రమే కాకుండా, టీపీసీసీలో ఖాళీగా ఉన్న కార్యనిర్వాహక అధ్యక్షుల నియామకంపై కూడా కసరత్తు జరుగుతోంది. ఎస్సీ మాదిగ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ లంబాడ వర్గం నుంచి బలరాం నాయక్ లేదా బెల్లయ్య నాయక్ ను కార్యవర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి నాయిని రాజేందర్ రెడ్డి లేదా చామల కిరణ్ కుమార్ రెడ్డికి చోటు దక్కవచ్చు. మైనార్టీల నుంచి అజ్మతుల్లా, ఫహీమ్ ఖురేషీ స్థానం ఆశిస్తున్నారు. వీళ్లతో పాటు ప్రచార కమిటీ ఛైర్మన్‌గా మధుయాష్కీని కొనసాగించాలా లేదా అన్నది, కోశాధికారిగా రోహిన్ రెడ్డి నియామకం వంటి అంశాలపై త్వరలోనే స్పష్టత రానుంది.మొత్తానికి జూన్ 2 లోపు జరగబోయే ఈ మార్పులు అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కొత్త జోష్ నింపుతాయా లేక అసంతృప్తులకు దారితీస్తాయా అన్నది వేచి చూడాలి.

## తెలంగాణ రాజకీయాల్లో వేడి

- మొదటి పేజీ తరువాయి

చర్యగా భావిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.ఇక ప్రధాన రాజకీయ చర్చకు కారణమైన అంశం నేడు జరుగుతున్న సమాంతర కార్యక్రమాలు. బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సు జరుగుతుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం "కిసాన్ మేళా" నిర్వహించనున్నట్లు ప్రకటించింది.నేటి రోజున రెండు ప్రధాన రాజకీయ కార్యక్రమాలు జరగడం యాదృచ్ఛికమా లేదా వ్యూహాత్మక రాజకీయ కౌంటర్ ప్లాన్‌లో భాగమా అన్న అంశంపై చర్చ కొనసాగుతోంది.ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్గాలు దీనిని తమ సభ ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నంగా అభివర్ణిస్తుండగా, కాంగ్రెస్ వర్గాలు మాత్రం రైతుల సంక్షేమం కోసం చేపట్టే ప్రభుత్వ కార్యక్రమాలకు రాజకీయ రంగు అద్దడం సరికాదని అంటున్నాయి.ఇదే తరహా పరిణామాలు గతంలోనూ చోటుచేసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇటీవల జగిత్యాలలో బీఆర్ఎస్ సభ జరుగుతున్న సమయంలోనే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి సభ నిర్వహించడంపై కూడా అప్పట్లో చర్చ జరిగింది.ఈ వరుస పరిణామాల నేపథ్యంలో, రాష్ట్ర రాజకీయాల్లో సభల సమన్వయం, సమాంతర కార్యక్రమాల వ్యూహాలపై కొత్త చర్చ మొదలైంది. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు ప్రజల దృష్టిని ప్రభావితం చేసేలా ఉన్నాయా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.మొత్తానికి, రైతు సభల చుట్టూ రాజకీయ ఉష్ణోగ్రత మరింత పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

## మోడీ సభ నుంచి ఆపరేషన్ తెలంగాణ

- మొదటి పేజీ తరువాయి

అనూహ్య రీతిలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మే 4న విడుదలయ్యే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ నమ్మకంగా ఉంది. ఆ గెలుపు ఉత్సాహంతో తెలంగాణలో 'ఆపరేషన్ తెలంగాణ'ను ప్రారంభించి, దక్షిణాదిలో తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది.కర్ణాటక తర్వాత దక్షిణాదిలో తెలంగాణనే తమకు అనుకూలమైన రాష్ట్రమని బీజేపీ మొదటి నుంచీ చెబుతోంది. అయితే, రాష్ట్ర పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కొంతకాలంగా ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. వర్గపోరుకు చెక్ పెట్టి, పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రధాని మోదీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునివ్వనున్నారు.మొత్తానికి మే 10న జరిగే ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందా? 'జానగ్రహ సభ' ద్వారా బీజేపీ తన సత్తా చాటుతుందా? అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణను కైవసం చేసుకునేందుకు కమలనాథులు వేస్తున్న స్కెచ్ ఏ మేరకు పారుతుందో వేచి చూడాలి.

## గన్‌పాయింట్ దోపిడీపై సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ ఫోకస్

- మొదటి పేజీ తరువాయి



100 మంది సిబ్బందితో రాత్రింబవళ్లు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటి కూడా అన్వేషణ విస్తరించారు. సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా రికార్డుల విశ్లేషణ ద్వారా నిందితుల కదలికలను ట్రాక్ చేసే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి.

**ప్రజల్లో భయాందోళన వ్యాపారుల ఆందోళన?**

నగరంలో తుపాకులతో దోపిడీ జరగడం స్థానిక ప్రజల్లో భయాందోళనలకు దారి తీసింది. ముఖ్యంగా వ్యాపార వర్గాలు భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి.
ఈ కేసు త్వరగా ఛేదించడమే ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది.

### డీసీసీ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా

# ఎమ్మెల్యే కు,నేతలకు కృతజ్ఞతలు తెలిపిన మామిండ్ల సురేష్

**హనుమకొండ, అక్షర సవాల్ :**డీసీసీ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా 31వ డివిజన్ న్యూ శాయంపేట కు చెందిన మామిండ్ల సురేష్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ అధ్యక్షులు ఇనుగాలా వెంకట్రామ్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం నేతలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మామిండ్ల సురేష్ తన సోదరుడు 31 డివిజన్ కార్పొరేటర్ మామిళ్ల రాజుతో కలిసి ఈ పదవి రావడానికి సహకరించిన నాయిని రాజేందర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, బట్టి శ్రీనివాస్, ఇవి శ్రీనివాసరావు తదితరులకు, డివిజన్ కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి ఎల్లప్పుడూ పాటుపడతానని మామిండ్ల సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు,కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# “భూ వరాహ యాగానికి కొమ్మాల నుంచి పవిత్ర మట్టి”

**దేవస్థానం ఈవో పి.ప్రసాద్**

**గడప గడపకు నరసింహం కార్యక్రమంలో భాగంగా స్వామీజీ సందర్శన**

**రైతుల సంక్షేమమే లక్ష్యం**

**కొమ్మాల, మే 5 అక్షర సవాల్:** భద్రాచలంకి చెందిన గో గోవింద కల్పవృక్ష నరసింహ సాలగ్రామ ఆశ్రమం నిర్వాహకులు శ్రీమాన్ డా॥ కృష్ణ చైతన్య స్వామి “గడప గడపకు నరసింహం” కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఉదయం 12 గంటలకు శ్రీ కొమ్మాల లక్ష్మి నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి. ప్రసాద్ తెలిపారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం సాలగ్రామ నరసింహ స్వామి ఆశ్రమంలో నిర్వహించనున్న భూ వరాహ యాగం కోసం, కొమ్మాల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం నుంచి పవిత్ర మట్టిని స్వామీజీ సేకరించినట్లు ఆయన వివరించారు. రైతుల క్షేమాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ యాగం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. తదుపరి స్వామీజీ భక్తులకు ఆశీస్సులు అందజేసినట్లు ఈవో పి. ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు.





# కేసులకు అదరం బెదరం - కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోం

**మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్**

**వరంగల్ క్రైమ్, అక్షర సవాల్ :** కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని, ఎన్ని కేసులు వేసినా ప్రజల తరపున పోరాటం ఆపబోమని బీఆర్ఎస్ సీనియర్ నేత, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన గులాబీ తోరణాలను జీడబ్ల్యూఎంసీ సిబ్బంది తొలగించడాన్ని నిరసిస్తూ గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేశారు . ఈ నిరసనలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ సర్కారు అక్రమ కేసులు బనాయించింది. మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు షఫీని పరామర్శించేందుకు వినయ్ భాస్కర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కార్యకర్తను విడుదల చేసే వరకు పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లేది లేదని ఆయన ప్రకటించారు. అన్యాయాన్ని ఎదిరిస్తే కేసులు పెడుతున్నారని, కార్యకర్తలను కాపాడుకోవడం తన బాధ్యత అని వినయ్ భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ కుట్రలో భాగంగా.. తమ సభను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం పోలీసుల ద్వారా అక్రమ అరెస్టులు చేపిస్తుందని ఆయన వాపోయారు.



# పౌష్టికాహారంతో ఆరోగ్య భవిష్యత్తు

**రంగాపురం అంగన్వాడీల్లో ఘనంగా పంపిణీ కార్యక్రమం**

**గర్భిణీలు, చిన్నారులకు లబ్ధి**

**నల్లబెల్లి, మే 5 అక్షర సవాల్:** పిల్లల ఆరోగ్య అభివృద్ధి, తల్లుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష స్పందనను అందుకుంది. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడంతో గ్రామంలో ఆరోగ్య చైతన్యం పెరిగింది. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి పౌష్టికాహారం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారం వినియోగం, ఆరోగ్య పరిరక్షణపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు మద్దతుగా నిలుస్తాయని సర్పంచ్ మాధురి రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి రామారావు, పాలకవర్గ సభ్యులు, గ్రామ మహిళలు, యువకులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# గులాబీ తోరణాల తొలగింపుపై బీఆర్ఎస్ ధర్నా....



**బల్దియా ప్రధాన కార్యాలయం పై దాడి...**

**అద్దాలు ధ్వంసం చేసిన కార్యకర్తలు..**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**

**వరంగల్,అక్షర సవాల్:** ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన సందర్భంగా వరంగల్ మహానగరంలో మహా నగరం లో ఏర్పాటు చేసిన గులాబీ తోరణాలను జీడబ్ల్యూఎంసీ సిబ్బంది తొలగించడంపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేసి, బల్దాల ప్రధాన కార్యాలయంలో అద్దాలను పగలగొట్టారు. మంగళవారం గులాబీ తోరణాలు తొలగింపు పై దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశానుసారము 6 వ కార్పొరేటర్ చెన్నం మధు ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కార్యాలయంలోని అద్దాలను ధ్వంసం చేశారు .బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రేవంత్ సర్కారు కావాలనే ప్రతిపక్షం గొంతు నొక్కాలని చూస్తోందని విమర్శించారు. గులాబీ జెండా ఎగిరినా, కేసీఆర్ సైన్యం కనబడినా కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా రైతుల పక్షాన, తెలంగాణ ప్రజల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంకు చెందిన కార్పొరేటర్లు రంజిత్ రావు, బొంగు అశోక్ యాదవ్, నల్ల స్వరూప రాణి సుధాకర్ రెడ్డి, బిఆర్ఎఫ్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ సభ్యులుగా ఎన్నికైన మామిళ్ళ సురేష్‌కు మంత్రి పొంగులేటి ఆశీస్సులు..

**హనుమకొండ, అక్షర సవాల్ :** హనుమకొండ డీసీసీ సభ్యులుగా ఎన్నికైన శుభ సందర్భంగా మామిండ్ల సురేష్ వరంగల్ ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆశీస్సులు తీసుకున్న మామిళ్ళ సురేష్‌ను, పార్టీకి మరింత సేవలు చేస్తూ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొంగులేటి కోరారు.



# కార్పొరేటర్ రవి నాయక్ నివాసంలో అభయాంజనేయ స్వామి పూజోత్సవం..

**హాజరైన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి**

**హనుమకొండ, మే 5, అక్షర సవాల్ :** 2 వ డివిజన్ కార్పొరేటర్ లావుడియా అనూష రవి నాయక్ స్వగృహంలో ఏర్పాటు చేసిన శ్రీ అభయాంజనేయ స్వామి పూజోత్సవంలో ఎనుగుల రాకేష్ రెడ్డి గ్రామ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీతారాములు, అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో సకల ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.



# కరీంనగర్ లోని ఖాజీపూర్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్:**కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నామని వాపోయిన రైతులుతాలు, తరుగు పేరుతో బస్తాకు నాలుగైదు కేజీలు దోచుకుంటున్నారని వాపోయిన రైతులు.



**అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి ఏమన్నారంటే:** ఇంకెంతమందిని బలి కొంటారు రైతులు చస్తున్నా వడ్లను కొనుగోలు చేయరా, కొనుగోలు కేంద్రాలవద్ద అరిగోస పడుతున్నా స్పందించరా ప్రతి గింజకు కేంద్రమే పైసలిస్తుంటే కొనడానికి మీకున్న ఇబ్బందేమిటి? వడ్లు కొన్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమీషన్ కూడా ఇస్తున్నాం కదా వడ్ల కొనుగోలు కేంద్రాలకు వెళితే మంత్రులను రైతులు కొట్టేటట్లు ఉన్నారు. రైతులను నట్టేట ముంచారు చేతికి పంట వచ్చేదాకా ఒక టెన్షన్ చేతికొచ్చాక అమ్ముకోవడానికి పడిగాపులు కాయాలా? 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు వస్తే ఇప్పటిదాకా 15 లక్షల మెట్రిక్ టన్నులే కొంటారా కొనుగోలు కేంద్రాలవద్ద టోకెన్లు ఇవ్వడానికి కూడా కమీషన్లు దండుకుంటున్న దుర్మార్గులు. తాలు, తరుగు, తేమ పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నారు రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నా స్పందించరా? వాస్తవాలు మాట్లాడితే మాపై ఎదురు దాడి చేస్తారా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోంది ఫీజు రీయంబర్స్ మెంట్ కూడా ఇయ్యలేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తారా?కేంద్రం ఎస్టీ విద్యార్థుల రీయంబర్స్ మెంట్ కోసం నిధులు మంజూరు చేసినా వాడుకోలేని అసమర్ధ ప్రభుత్వం కాంగ్రెస్ ది..

# నల్లాల దగ్గర అర్ధరాత్రి నిరీక్షణలు

**హైదరాబాద్, మే 5:** భానుడి భగభగలకు నగరం విలవిలలాడుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు తాగునీటి కొరత తోడవడంతో సామాన్యుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. నగరానికి నీటిని అందించే ప్రధాన జలాశయాల్లో నిల్వలు వేగంగా పడిపోతుండటమే ఈ దుస్థితికి ప్రధాన కారణం.నగర దాహార్తిని తీర్చే నాగార్జునసాగర్, ఎల్లంపల్లి వంటి జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి.నాగార్జునసాగర్‌లో పూర్తి స్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 160 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎల్లంపల్లిలో ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 20 టీఎంసీల సామర్థ్యానికి గాను నిల్వలు 9 టీఎంసీలకు పడిపోయాయి. మే నెలలో ఈ మట్టాలు మరిన్ని కనిష్ఠ స్థాయికి పడిపోయే ప్రమాదం ఉండటంతో జలమండలి అత్యవసర పంపింగ్ చర్యలకు సిద్ధమవుతోంది.సాధారణంగా రోజు విడిచి రోజు రావాల్సిన నీరు, ఇప్పుడు మూడు నాలుగు రోజులకోసారి సరఫరా అవుతోందని పలు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. సరఫరా అయ్యే కొద్ది సమయం కూడా నీటి ఒత్తిడి (ప్రెషర్) తక్కువగా ఉండటంతో బిందెలు నిండటానికి గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. సీతాఫల్‌మండి, డీబీఆర్ లేన్ వంటి ప్రాంతాల్లో ప్రజలు నిద్ర మానుకొని అర్ధరాత్రి వేళ నీటి కోసం వీధుల్లో ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.ఒకవైపు నీటి కొరత వేధిస్తుంటే, మరోవైపు పాతబస్తీ, ఖైరతాబాద్, అమీర్‌పేట వంటి ప్రాంతాల్లో పైపులైన్ల లీకేజీల కారణంగా మురుగు నీరు కలిసి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లా వదిలిన మొదటి 15-20 నిమిషాల పాటు కలుషిత నీరు వస్తుండటంతో, వాటిని వదిలేయడం వల్ల భారీగా నీరు వృథా అవుతోంది.నల్లా నీరు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. దీనివల్ల ఖర్చులు పెరగడమే కాకుండా, ట్యాంకర్ల కోసం కూడా రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. నగరవ్యాప్తంగా సుమారు 14.43 లక్షల కనెక్షన్ల ద్వారా ప్రతిరోజూ 2,647 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం జనం దాహార్తి తీరడం లేదు.ఖైరతాబాద్, బేగంపేట, ముషీరాబాద్, చందానగర్, కూకట్‌పల్లి సహా దాదాపు అన్ని ప్రధాన ప్రాంతాల్లో నీటి కష్టాలు తీవ్ర రూపం దాల్చాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



# బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది: వీహెచ్

**హైదరాబాద్, మే 05:** బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మాట్లాడిన ఆయన, ఈ నెల 9వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. ‘బీసీ హక్కుల కోసం ప్రాణం పోయినా సరే పోరాడుతా’ అని స్పష్టం చేసిన వీహెచ్.. బీజేపీ బీసీ ఎంపీలు ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ‘అంబేద్కర్‌ను మా దేవుడిగా భావిస్తాం. అలాంటి మహనీయుడిని కూడా అవమానించే విధంగా పరిస్థితులు ఉన్నాయి’ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా జరుగుతున్న జనగణనలో బీసీల ప్రస్తావనే లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ‘బీసీలు ఓట్లు వేయడం లేదా? వారి సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదు?’ అని వీహెచ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు లేఖలు రాసినా స్పందన రాలేదని వీహెచ్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ధర్నాలు జరిగినప్పటికీ బీసీ సమస్యలపై కేంద్రం వైఖరిలో మార్పు రాలేదని వీహెచ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే తాను నిరాహార దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించారు. వీహెచ్ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో బీసీ అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.



# బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి నిజాంపేట్లో అగ్నిప్రమాదం

**6 ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధం...**


**హైదరాబాద్:**బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ లో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు 6 ఫర్నిచర్ దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. షాపుల్లో నిల్వ ఉంచిన ఫర్నిచర్ సామగ్రి పూర్తిగా దగ్ధమై లక్షల రూపాయల నష్టం జరిగింది...సమాచారం అందుకున్న వెంటనే 4 అగ్నిమాపక యంత్రాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవలే ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో మళ్లీ ఇలాంటి ఘటన జరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## ఆకట్టుకుంటున్న 'సతీ లీలావతి' ట్రైలర్

మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. చాలా కాలం తర్వాత లావణ్య లీడ్ రోల్‌లో కనిపిస్తున్న ఈ చిత్రానికి 'భీమిలీ కబడ్డీ జట్టు', 'హమీ' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వం వహించారు. 'శాకుంతలం' ఫేమ్ మలయాళ నటుడు దేవ్ మోహన్ ఇందులో హీరోగా నటించగా, భార్యాభర్తల మధ్య జరిగే సరదా గొడవలు, ఎమోషన్స్‌ను మేళవించి ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా దీనిని తెరకెక్కించారు. ఈ సినిమాను మే 8, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ ముహూర్తం ఖరారు చేసింది.

## మైండ్ గేమ్‌తో వస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్..
# ఆకట్టుకుంటున్న 'ఐ నోబడీ' టీజర్





మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం (ఐ, నోబడీ). 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.



## వరుస యాక్షన్ చిత్రాలతో గోపీచంద్ దూకుడు..
### మరో యాక్షన్ డ్రామాకి రెడీ..!

టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. కెరీర్‌లో మరోసారి జోరు పెంచిన ఆయన, కొత్త కథలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం ఆయన దర్శకుడు సంకల్ప్ రెడ్డి తెరకెక్కిస్తున్న 'భరతవర్ష' చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా దృశ్యాలకు మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో గోపీచంద్ తన రూపాన్ని పూర్తిగా మార్చుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే సమయంలో, నూతన దర్శకుడు కుమార్ సాయి తో మరో చిత్రానికి కూడా ఆయన అంగీకరించారు. ఈ సినిమా చిత్రీకరణలో ఎక్కువ భాగం విదేశాల్లో జరగనుంది. సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక తాజాగా గోపీచంద్ తన జాబితాలో మరో యాక్షన్ కథను చేర్చాడు. ప్రముఖ స్టంట్ మాస్టర్ వెంకట్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ సంగీతం అందించనున్నారు. పలువురు ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్టులో భాగమవుతున్నారు. ఈ కొత్త సినిమా ప్రారంభోత్సవం మే 3న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా జరగనుంది. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. ప్రస్తుతం చేతిలో ఉన్న చిత్రాలను పూర్తి చేసిన తర్వాత, గోపీచంద్ ఈ కొత్త యాక్షన్ చిత్ర షూటింగ్‌లో పాల్గొననున్నారు.

## 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు అద్భుతం.. ఆకట్టుకుంటున్న 'సింగ్ గీతం' టీజర్!




భారతీయ సినీ చరిత్రలో అద్భుత ప్రయోగాలు చేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, 94 ఏళ్ల వయసులో మళ్ళీ మెగాఫోన్ పట్టి సరికొత్త మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో నటించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'కల్కి 2898 ఏడీ' దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. టీజర్ చూస్తుంటే ఒక వైవిధ్యమైన కథాంశంతో, సంగీత ప్రాధాన్యత ఉన్న చిత్రంగా ఇది కనిపిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ) ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. జూన్ 11వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ వయసులో కూడా ఆయనలోని ఉత్సాహం చూసి సినీ ప్రముఖులు మరియు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

## తిరుపతి ఘటనపై రష్మీ ఆగ్రహం..
### ట్రోలింగ్‌పై గట్టి కౌంటర్ ఇచ్చిన జబర్దస్త్ యాంకరమ్మ



బుల్లితెర, వెండితెరపై తనదైన గుర్తింపు తెచ్చుకున్న రష్మీ గౌతమ్ మరోసారి జంతువులపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తరచుగా స్పందించే రష్మీ, ముఖ్యంగా మూగజీవాల సంరక్షణ విషయంలో ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తిరుపతిలో జరిగిన ఒక ఘటనపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో డీజిల్ కొరత సమస్యపై నిరసనల నేపథ్యంలో తిరుపతిలో ఒక ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎద్దుల బండిపై ఆటోను, దానిపై కొంతమంది వ్యక్తులను ఎక్కించి ఎద్దులతో లాగించిన ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, రష్మీ గౌతమ్ తీవ్రంగా స్పందించారు. నిరసన పేరుతో మూగజీవాలపై ఇంత భారం మోపడం క్రూరత్వమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇలాంటి చర్యలు చేసే వారు తమ కర్మ ఫలితాన్ని అనుభవిస్తారు" అంటూ ఘాటుగా హెచ్చరించారు. అలాగే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రష్మీ వ్యాఖ్యలపై కొంతమంది సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. గతంలో ఆమె నటించిన సినిమాలను ప్రస్తావిస్తూ వ్యక్తిగత విమర్శలు చేశారు.

# ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు తీసుకోవడం తప్పు..
### టికెట్ రేట్లపై రవిబాబు సంచలన వ్యాఖ్యలు!



వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ ఈ చిత్రం మే 08న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచడం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.



## హారర్ థ్రిల్లర్‌గా నవీన్ చంద్ర 'పోలీస్ కంప్లైంట్'

వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర వంటి ప్రతిభావంతులైన నటీనటుల కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'పోలీస్ కంప్లైంట్' మే 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా హారర్ మరియు యాక్షన్ థ్రిల్లర్ అంశాల కలబోతగా రూపొందడం విశేషం. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ఇచ్చింది. చిత్రంలో కీలక పాత్ర పోషించిన నటుడు కృష్ణసాయి పుట్టినరోజును పురస్కరించుకుని, దివంగత సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ఒక ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించారు. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగుతూనే, ప్రేక్షకులకు వెన్నులో వణుకు పుట్టించే హారర్ ఎలిమెంట్స్ ఇందులో పుష్కలంగా ఉండబోతున్నాయి. గతంలో 'ఆదిపర్వం', 'రాఘవరెడ్డి', 'అఘోర' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న సంజీవ్ మేగోటి, ఈసారి పోలీస్ కంప్లైంట్ సినిమాతో మరోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలోని ప్రధాన ఆకర్షణ నటీనటుల ఎంపిక. వరలక్ష్మి శరత్‌కుమార్ తన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో సరికొత్త షేడ్స్ చూపించనుండగా, వెర్సటైల్ హీరో నవీన్ చంద్ర ఒక విభిన్నమైన రోల్‌లో మెరవబోతున్నారు. వీరిద్దరి మధ్య సాగే డ్రామా సినిమాకు ప్రధాన బలంగా నిలవనుంది. కేవలం ప్రధాన జంట మాత్రమే కాకుండా, ఈ చిత్రంలో ఏకంగా 52 మంది సీనియర్ ఆర్టిస్టులు నటించడం విశేషం. రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్ వంటి అనుభవజ్ఞులైన నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. భారీ తారాగణం ఉండటం వల్ల సినిమాలోని ప్రతి సన్నివేశం చాలా గ్రాండ్‌గా, పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. సాంకేతిక పరంగా కూడా ఈ చిత్రం ఉన్నత ప్రమాణాలతో రూపొందింది. ముగ్గురు సంగీత దర్శకులు ఆరోహణ సుధీంద్ర, సంజీవ్ మేగోటి మరియు సుధాకర్ మారియో ఈ చిత్రానికి బాణీలు సమకూర్చగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాధ్యతను స్వయంగా దర్శకుడే తీసుకున్నారు.

## బిజినెస్

### టెక్ మహీంద్రా చేతికి కెనడా ఐటీ కంపెనీ




**న్యూఢిల్లీ:** ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా కెనడా కంపెనీ అల్లూరి టెక్నాలజీస్ ఇంక్(అవాంట్)ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనిలో భాగంగా తొలుత 85% వాటాను సొంతం చేసుకోనుంది. ఇందుకు 2.8 కోట్ల కెనడియన్ డాలర్లు(రూ. 171 కోట్లు) వెచ్చించనుంది. మూడేళ్ల తదుపరి మిగిలిన 15% వాటాను ముందుగా నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు టెక్ మహీంద్రా పేర్కొంది. అవాంట్‌తో.. సొంత అనుబంధ కంపెనీ టెక్ మహీంద్రా కన్సల్టింగ్ గ్రూప్(టీఎంసీజీ) వాటా కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. తాజా కొనుగోలుతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సరవసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) విభాగంలో మరింత బలపడే వీలున్నట్లు తెలియజేసింది. 2029 జూన్ 30కల్లా మిగిలిన 15% వాటా సైతం దక్కించుకోనున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు ద్వారా ఉత్తర అమెరికా మార్కెట్‌లో టెక్ మహీంద్రా తన ఉనికిని మరింత సుస్థిరం చేసుకోనుంది. ముఖ్యంగా అల్లూరి టెక్నాలజీస్‌కు ఉన్న డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ నైపుణ్యం, టెక్ మహీంద్రా గ్లోబల్ నెట్‌వర్క్‌కు తోడవ్వడం వల్ల క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో కొత్త ప్రాజెక్టులను చేజిక్కించుకునే అవకాశం ఉంటుంది.

### పోస్టాఫీసు బ్యాంక్‌లో కొత్త అకౌంట్..
### జీరో బ్యాలెన్స్‌తో..




కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ కొత్త అకౌంట్‌ను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా శక్తికి ఆర్థికంగా మరింత ఊతమిచ్చేందుకు 'స్వయం సహాయక బృందాల పొదుపు ఖాతా'ను ప్రత్యేకంగా ప్రారంభించింది. ఎటువంటి ఛార్జీలు లేని ఈ ఖాతా ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కానున్నాయి.

ఈ ఖాతా ప్రత్యేకతలు ఇవే..

మహిళా సంఘాల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఖాతాలో అనేక ఆకర్షణీయమైన ఫీచర్లు ఉన్నాయి.

జీరో బ్యాలెన్స్: ఖాతాలో కనీస నిల్వ ఉంచాల్సిన అవసరం లేదు. దీనిపై ఎలాంటి జరిమానాలు ఉండవు.

పరిమితి: ఈ ఖాతాలో గరిష్టంగా రూ. 2,00,000 వరకు నగదును ఉంచుకోవచ్చు.

ఉచిత సేవలు: నగదు జమ ఉపసంహారణపై ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరు. అలాగే, క్యూఆర్ కార్డ్ కూడా ఉచితంగానే అందజేస్తారు. ఖాతా మూసివేతకు కూడా ఎటువంటి ఛార్జీలు లేకపోవడం విశేషం.

# సామాన్యుడిపైకి గ్యాస్ మిస్సైల్

## వాణిజ్య ఎల్‌పీజీ ధర 5 నెలల్లో రూ.1,491 పెంపు

**న్యూఢిల్లీ :** కార్మిక దినోత్సవం రోజున ప్రజలకు కేంద్రంలోని మోదీ సర్కార్ ఊహించని గిఫ్ట్ ఇచ్చింది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ఎలా ఉన్నప్పటికీ ప్రజలపై ఎటువంటి ఇంధన భారం మోపబోమని ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు పదేపదే హామీ ఇచ్చిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఎన్నికలు ముగిసిన వెంటనే ప్లేట్ ఫిరాయించింది. ప్రజలపై గ్యాస్ పిడుగు వేసింది. దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు టిఫిన్ సెంటర్లు ఉపయోగించే వాణిజ్య సిలిండర్‌పై రికార్డు స్థాయిలో మోయలేని భారం మోపింది. 19 కిలోల సిలిండర్‌పై దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఒకేసారి రూ.993 పెంచేసింది. దీంతో ఢిల్లీలో దాని ధర రూ. 3,071.50కి చేరింది. అలాగే 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల ధరలను ఒక్కో బాటిల్‌కు రూ. 549 నుంచి రూ. 810.50కి పెంచింది. 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ (డొమెస్టిక్ ఎల్‌పీజీ) ధర ప్రస్తుతం రూ. 913 కాగా, 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధర దానికంటే కొంచెం తక్కువగా ఉంది. అలాగే టెలికం సిగ్నల్ టవర్లు వంటి పారిశ్రామిక వినియోగదారులు వాడే బల్క్ డీజిల్ ధర లీటరుకు రూ. 137 నుంచి రూ. 149కి పెరిగింది. పెట్రోల్ పంపుల వద్ద లభించే లీటరు డీజిల్ ధర రూ. 87.62తో పోలిస్తే ఈ ధరలు ఎక్కువ. అంతర్జాతీయ విమానయాన సంస్థల జెట్ ఇంధనం ధరను కూడా ప్రభుత్వం భారీగా పెంచింది. వాణిజ్య ఎల్‌పీజీ ధర గడచిన 5 నెలల్లో రికార్డు స్థాయిలో రూ. 1,491 పెరిగింది. మార్చి 1 రూ. 28 పెంచగా మార్చి 7న రూ. 114.5 పెంచారు. తాజాగా రికార్డు స్థాయిలో రూ. 993 పెంచుతున్నట్లు ప్రభుత్వ అధీనంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ శుక్రవారం ప్రకటించింది. ఈ పెంపు వల్ల



దేశవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, చిన్న టిఫిన్ సెంటర్ల నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభావం నేరుగా వినియోగదారుడిపై పడే అవకాశం అధికంగా ఉంది. కాగా , విమానయాన సంస్థలు, వినియోగదారులను కాపాడేందుకు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు పెరుగుతున్న ప్రపంచ ఇంధన ధరల భారాన్ని భరించాలని నిర్ణయించుకున్నాయని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) తెలిపింది. పెట్రోల్, డీజిల్, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల రిటైల్ ధరలు స్థిరంగా ఉండగా అంతర్జాతీయ ధరల అస్థిరత నుండి వినియోగదారులను రక్షించడం, సాధారణ ప్రజలను ప్రభావితం చేసే కీలక ఇంధనాల ధరలలో ఎటువంటి సవరణ జరగలేదని ఐఓసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముడి సరుకుల ఖర్చుల ఆధారంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఏటీఎఫ్ ధరలను సవరిస్తారు.

**ఏటీఎఫ్ ధర 5% పెంపు**

అంతర్జాతీయ విమానయాన సంస్థల జెట్ ఇంధన ధరలను 5 శాతం పెంచారు. వరుసగా ఇది రెండో నెల పెంపు. ప్రభుత్వ రంగ చమురు సంస్థల ప్రకారం భారత్‌లో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయానికి నిలయమైన ఢిల్లీలో అంతర్జాతీయ విమానయాన సంస్థలకు ఏటీఎఫ్ ధరలను కిలోలీటరుకు 76.55 డాలర్లు లేదా 5.33 శాతం పెంచి 511.86 డాలర్లకు చేర్చారు. మొత్తం వినియోగంలో దాదాపు 90 శాతం వాటా ఉన్న పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు యథాతథంగా ఉన్నాయని ఐఓసీ తెలిపింది.

**డొమెస్టిక్ ఎల్పీజీ యథాతథం**

గృహ వినియోగ వంటగ్యాస్ ధరలు యథాతథంగా ఉన్నాయి. మార్చి 7న చివరిసారిగా ధరలను సవరించారు. అప్పుడు 14.2 కిలోల సిలిండర్‌పై రూ. 60 పెంచారు. ప్రస్తుతం ఢిల్లీలో ఒక గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 913గా ఉంది. గత ఏడాది మార్చిలో లీటరుకు రూ. 2 తగ్గించిన అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలు కూడా స్తంభించిపోయాయి. ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 94.72 కాగా డీజిల్ ధర లీటరుకు రూ. 87.62గా ఉంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం అంతర్జాతీయ బెంచ్‌మార్కులు, మారకపు రేట్లకు అనుగుణంగా నెలవారీగా ఏటీఎఫ్, ఎల్‌పీజీ ధరలను సవరిస్తాయి.

## రిలయన్స్, యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్‌కు బిగ్ డీల్

భారతదేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే దిశగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక అడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (యూసీజీ) సాంకేతికతకు వీలు కల్పించేలా రూపొందించిన వాణిజ్య బొగ్గు గనులను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకు న్నాయి. ఈ మేరకు నాలుగు బొగ్గు గనులకు సంబంధించిన 'కోల్ మైన్ డెవలప్‌మెంట్ అండ్ ప్రొడక్షన్ అగ్రిమెంట్స్' (సీఎంపీడీఏ)పై సంస్థలు సంతకాలు చేశాయి.

**ఎవరికి ఏ గనులు?**

రిలయన్స్ ఇండస్ట్రీస్: ఆంధ్రప్రదేశ్‌లోని రెచెర్ల, చింతలపూడి సెక్టార్ ఏ1 బొగ్గు గనులను సొంతం చేసుకుంది.

యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్: ఒడిశాలోని బెల్పహార్, తంగార్దిహి ఈస్ట్ బొగ్గు గనులను దక్కించుకుంది.

ఈ నాలుగు గనుల్లో రెండు పాక్షికంగా నిర్వహిస్తున్నావి కాగా, మరో రెండు పూర్తిగా కార్యకలాపాలు సాగిస్తున్నవి.

ఏమిటీ యూసీజీ ప్రత్యేకత?

సాధారణంగా బొగ్గును గనుల నుంచి వెలికితీసి ఆపై విద్యుత్ లేదా ఇంధనం కోసం ఉపయోగిస్తారు. అయితే, యూసీజీ సాంకేతికత అందుకు భిన్నం. ఇది బొగ్గును నేరుగా సీమ్ (నేల లోపల బొగ్గు పొర)లోనే సింథటిక్ వాయువు (సిన్‌గ్యాస్)గా మారుస్తుంది. దీనివల్ల





సంప్రదాయ మైనింగ్ అవసరం ఉండదు. సాధారణ పద్ధతుల్లో దీన్ని వెలికితీయడం కష్టసాధ్యం. ఈ పద్ధతి ద్వారా లోతైన బొగ్గు పొరల నుంచి కూడా సింథటిక్ వాయువును తయారు చేయవచ్చు. బొగ్గు మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, ఈ గనులలో సాంప్రదాయ మైనింగ్‌తో పాటు యూసీజీ పద్ధతిని కూడా అనుసరించే వెసులుబాటును ఆపరేటర్లకు కల్పించారు. ఇది దేశంలోని ఇంధన వనరులను గణనీయంగా పెంచుతుంది. ఈ ప్రాజెక్టులు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా దేశీయ పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ద్వారా వెలువడే సిన్‌గ్యాస్ యూరియా, అమ్మోనియా తయారీకి కీలకంగా మారుతుంది. ఇది ఎరువుల దిగుమతులపై భారత్‌కున్న ఆధారపడటాన్ని తగ్గించి ఆహార భద్రతకు ఊతమిస్తుంది. కెమికల్స్, పెట్రోకెమికల్స్ తయారీలో సహజ వాయువు, నాఫ్తా స్థానంలో ఈ సిన్‌గ్యాస్‌ను ఉపయోగించి మిథనాల్, డైమిథైల్ ఈథర్ (డీఎంఈ), ఇతర సింథటిక్ ఇంధనాలను స్వదేశంలోనే తయారు చేసే అవకాశం లభిస్తుంది. ఈ నాలుగు ఒప్పందాలతో కలిపి ఇప్పటివరకు వాణిజ్య బొగ్గు వేలం ద్వారా జరిగిన మొత్తం ఒప్పందాల సంఖ్య 138కి చేరుకుంది.

# జీవితంలో ఇంతలా భయపడే రోజు వస్తుందనుకోలేదు

న్యూజిలాండ్ స్టార్, ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ కైలీ జెమీసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన జీవితంలో పదిహేనేళ్ల పిల్లాడికి కూడా భయపడాల్సిన రోజు వస్తుందని అస్సలు ఊహించలేదన్నాడు. అతడిని అవుట్ చేసేందుకు ఆసీస్ దిగ్గజ పేసర్ మిచెల్ స్టార్క్‌తో చర్చించాల్సి వచ్చిందని పేర్కొన్నాడు.

**36 బంతుల్లోనే శతక్కొట్టాడు**

అవును.. జెమీసన్ చెప్తున్నది రాజస్తాన్ రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ గురించే!.. ఐపీఎల్-2026లో ఈ లెఫ్టాండర్ బ్యాటర్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటికే ఈ సీజన్‌లో తన ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు వైభవ్. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో 36 బంతుల్లోనే శతక్కొట్టాడు.

**ఎదురుగా ఎవరున్నా డోంట్ కేర్**

ఇక ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్ సందర్భంగా ప్రపంచస్థాయి బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లోనూ సిక్సర్లు బాది తన బ్యాట్ పవరేంటో మరోసారి చాటిచెప్పాడు వైభవ్. ఎదురుగా ఎంతటి దిగ్గజ బౌలర్ ఉన్నా బంతిని బాదడమే లక్ష్యంగా పెట్టుకుని పరుగులు పిండుకుంటున్నాడు.

**నేనూ భయపడ్డా**

ఈ నేపథ్యంలో తాను సైతం వైభవ్ సూర్యవంశీ విషయంలో భయపడ్డాడని కివీస్ స్టార్, ఢిల్లీ పేసర్ కైలీ జెమీసన్ అన్నాడు. కాగా శుక్రవారం నాటి మ్యాచ్‌లో ఢిల్లీ రాజస్తాన్‌తో తలపడ్డ సంగతి తెలిసిందే. జైపూర్ వేదికగా టాస్ గెలిచిన రాజస్తాన్.. తొలుత బ్యాటింగ్ చేసింది. అయితే, ప్రతీ మ్యాచ్‌లోనూ అదరగొడుతున్న ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4)లను త్వరగానే వెనక్కి పంపడంలో ఢిల్లీ సఫలమైంది. వైభవ్‌ను జెమీసన్ బౌల్డ్ చేయగా.. జైసూను





మిచెల్ స్టార్క్ పెవిలియన్‌కు పంపాడు.

**ఢిల్లీ గెలుపు**

ఓపెనర్లు విఫలమైనా రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగుల మేర మంచి స్కోరు సాధించింది. ధ్రువ్ జురెల్ (42), డొనోవాన్ ఫెరీరా (14 బంతుల్లో 47 నాటౌట్)లతో పాటు కెప్టెన్ రియాన్ పరాగ్ (50 బంతుల్లో 90) ఇన్నింగ్స్ ఇందుకు కారణం. అయితే, 226 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ అనూహ్య రీతిలో ఊదిపారేసింది. ఓపెనర్లు పాతుమ్ నిస్సాంక (33 బంతుల్లో 62), కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 75).. వన్‌డౌన్ బ్యాటర్ నితీశ్ రాణా (17 బంతుల్లో 33) వేగంగా ఆడి పని పూర్తి చేశారు.

**ఇంతలా భయపడే రోజు వస్తుందనుకోలేదు**

ఇదిలా ఉంటే.. వైభవ్ సూర్యవంశీని త్వరగా పెవిలియన్‌కు పంపేలా తాను ముందు నుంచే సన్నద్ధమయ్యాయని జెమీసన్ తాజాగా వెల్లడించాడు. "పదిహేనేళ్ల పిల్లాడికి కూడా ఇంతలా భయపడే రోజు వస్తుందని నా జీవితంలో ఎప్పుడూ అనుకోలేదు. అతడిని అవుట్ చేసేందుకు మేము ఎన్నో వ్యూహాలు, ప్రణాళికలు రచించుకున్నాము. అందుకు తగ్గ ఫలితం వచ్చింది" అని జెమీసన్ చెప్పుకొచ్చాడు. రాజస్తాన్‌కు కీలకమైన ఓపెనింగ్ జోడీని విడదీసేందుకు తానూ, స్టార్క్ ప్లాన్ వేశామని.. అనుకున్నట్లే ఆరంభంలోనే వారిని వెనక్కి పంపామని హర్షం వ్యక్తం చేశాడు. కాగా 15 ఏళ్ల వైభవ్‌ను అవుట్ చేసిన తర్వాత.. 31 ఏళ్ల జెమీసన్ వైల్డ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాడు. అతడి ముఖంలో ముఖం పెట్టి గట్టిగా అరుస్తూ చప్పట్లు కొట్టాడు. దీంతో బీసీసీఐ జెమీసన్‌ను మందలించడంతో పాటు అతడి ఖాతాలో ఓ డిమెరిట్ పాయింట్ జతచేసింది.

## దుర్గామాత కూడా ఫలితాలను అంచనా వేయలేదు: సౌరవ్ గంగూలీ

**కోల్‌కతా:** ప్రధాని మోదీ కానీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కానీ, బెంగాలీలు పూజించే దుర్గామాత కూడా 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అంచనా వేయలేరని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు. మే 4వ తేదీన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జరనున్న నేపథ్యంలో ఆయన్ను ప్రశ్న అడగ్గా.. అలాంటి ప్రశ్నలకు తాను ఎలా సమాధానం ఇవ్వగలనన్నారు. సోమవారం బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేసిన తర్వాతే ఆ విషయం తెలుస్తుందన్నారు. అప్పుడే మనకు సమాధానం దొరుకుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఊహాగానాలు పెరిగిపోతున్న నేపథ్యంలో.. మమతా దీదీ కానీ, మోదీజీ కానీ, దుర్గామాతా కానీ వాటిని అంచనా వేయలేరన్నారు. 294 స్థానాలు ఉన్న బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 23, 29వ తేదీల్లో ఆ ఎన్నికలు నిర్వహించారు. ఇక ఇవాళ సౌత్ 24 పరగనాస్ జిల్లాలో 15 పోలింగ్ బూత్‌ల పరిధిలో రీపోలింగ్ నిర్వహిస్తున్నారు. బెంగాల్ ఎన్నికలకు రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర బలగాలు భారీ స్థాయిలో బందోబస్తు నిర్వహించాయి. తొలి దశ పోలింగ్ 152 స్థానాలు, రెండో దశ 142 స్థానాల్లో జరిగింది. అయితే చాలా వరకు ఎగ్జిట్ పోల్స్ .. బీజేపీకే విజయాన్ని కట్టబెట్టాయి.

## స్పోర్ట్స్

### కోచ్‌లు, సెలక్టర్లు కావలెను! ఉండాల్సిన అర్హతలు ఇవే



గత కొన్నేళ్లుగా దేశవాళీ టోర్నీల్లో సత్తా చాటలేక చతికిలపడుతోంది తమిళనాడు క్రికెట్ జట్టు. ఈ నేపథ్యంలో తమిళనాడు క్రికెట్ సంఘం శిక్షణ బృందాన్ని బలోపేతం చేసే పనిలో పడింది.

వరుస వైఫల్యాలు

కాగా గత రంజీ సీజన్‌లో గ్రూప్ దశలో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న తమిళనాడు జట్టు... సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో సూపర్ లీగ్ దశకు చేరలేకపోయింది. దీంతో కోచింగ్ స్టాఫ్‌ను మార్పు చేయాలని భావించిన తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) కొత్త కోచ్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పురుషుల, మహిళల విభాగాల్లో సీనియర్, జూనియర్ జట్లకు కొత్త కోచ్‌లను నియమించనుంది. అలాగే సెలెక్షన్ కమిటీ సభ్యులను సైతం ఎంపిక చేయనుంది. ఈ నెల 10 దరఖాస్తులకు చివరి తేదీ కాగా... పరిమిత ఓవర్లకు, టెస్టు ఫార్మాట్‌కు వేర్వేరు కోచ్‌లను ఎంపిక చేయనుంది.

ఉండాల్సిన అర్హతలు ఇవే

కాగా 60 సంవత్సరాలకు లోబడి ఉండి బీసీసీఐ లెవల్--2 కోచింగ్ సర్టిఫికెట్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని టీఎన్‌సీఏ ఒక ప్రకటనలో తెలిపింది. 'నిబంధనల ప్రకారం కొత్త కోచ్‌ల నియామకం చేపడతాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం తదుపరి పరీక్షలు నిర్వహిస్తాం' అని టీఎన్‌సీఏ కార్యదర్శి భగవాన్ దాస్ తెలిపారు. ప్రస్తుతం తమిళనాడు జట్లకు సెంథిల్‌నాథన్, వెంకటరమణ కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI :**TEL TEL / 2023/ 84132